# రసమయిని భారీ మెజార్టీతో గెలిపించాలి



ఇల్లంతకుంట: రేపాకలో కారు గుర్తుకు ఓటేయాలని ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- కొత్తగట్టు, రేపాక గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

శంకరపట్నం, నవంబర్ 17: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్‌ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులు కొత్తగట్టులో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా డాక్టర్ రసమయిని గెలిపించవలసిన ఆవశ్యకతపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యేగా రసమయి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటు వేసి రసమయి బాలకిషన్‌కు హ్యాట్రిక్ గెలుపు అందించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మొకిరాల కిషన్‌రావు, మాజీ సర్పంచ్ సర్వ తిరుపతి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉమ్మెంతల సతీశ్‌రెడ్డి, తూముల శ్యాంరావు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రేపాకలో**

ఇల్లంతకుంట, నవంబర్ 17: మండలంలోని రేపాక గ్రామంలో బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ రొండ్ల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. గ్రామాల్లో రైతులకు సాగునీటి కొరత లేకుండా చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని, ఇది బీఆర్ఎస్‌తోనే సాధ్యమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడో సారి బీఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీ అందించి గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఓగ్గు నర్సయ్య, చారి, రవీందర్, రాంరెడ్డి, రమణారెడ్డి తోపాటు గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శంకరపట్నం: కొత్తగట్టులో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 17: మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు, యువకులు 100 మంది శుక్రవారం మాజీ సర్పంచ్ రమేశ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరగా, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కుస కొమురయ్య, ఉపాధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ , బల్ల సతీశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రసమయి బాలకిషన్

## ఓటింగ్ శాతం పెంపునకు కృషి చేయాలి

- బీఎల్‌వోలతో సమీక్షా సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీవో సంధ్యారాణి

శంకరపట్నం, నవంబర్ 17: ఎన్నికల్లో ఈసారి ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని డీఆర్‌డీవో, స్వీప్ నోడల్ ఆఫీసర్ సంధ్యారాణి ఆదేశించారు. ప్రలోభాలకు లొంగకుండా, ఓటు విలువ తెలుసుకుని నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్లకు అవగాహన శిబిరాలు నిర్వహించాలన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ నిర్వహణపై స్వీప్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటరుగా నమోదైన వారు ఓటు వేసేలా బీఎల్‌వోలు ప్రోత్సహించాలని తెలిపారు. మానకొండూర్ నియోజకవర్గంలో గతంలో 81 శాతం పోలింగ్ నమోదైనట్లు గణాంకాలు ఉన్నాయన్నారు. దివ్యాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వాహన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. లేవలేని స్థితిలో మంచానికి పరిమితమై ఉన్న ఓటర్ల ఇంటికే ఈవీఎం యంత్రాలను పంపి ఓటు వేసే సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. మెరుగైన పోలింగ్‌కు కలిసి కట్టుగా పని చేయాలని చెప్పారు. సమీక్షా సమావేశంలో తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో శ్రీవాణి, ఏపీడీపీవో అరవింద, ఎస్సీ కార్పొరేషన్ ఈవో రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## తప్పిన పెను ప్రమాదం

తిమ్మాపూర్, నవంబర్ 17: మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో లారీ ఢీకొని వడ్ల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు వడ్లలోడ్‌తో రామకృష్ణకాలనీలోని సీడ్ మిల్‌కు వెళ్తుండగా.. హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న లారీ నుస్తులాపూర్ స్టేజీ సమీపంలో ట్రాక్టర్ ట్రాలీని వెనుక నుంచి ఢీకొన్నది. దీంతో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడగా, ఇంజిన్ లారీ ముందుకు దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను మళ్లించారు.

## పెద్దమ్మ ఆలయంలో చోరీ

గన్నేరువరం, నవంబర్ 17: మండల కేంద్రం శివారులోని పెద్దమ్మ ఆలయంలో అమ్మవారి నగలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఆలయ పూజారి సమ్మయ్య కథనం ప్రకారం.. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు పూజారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ తలుపులకు వేసిన తాళం ధ్వంసమై ఉండడంతో పాటు అమ్మవారి ఆభరణాలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## ఎమ్మెల్యే, సుడా చైర్మన్‌కు ఘన సన్మానం



ఎమ్మెల్యేను, జీవీఆర్‌ను గజమాలతో సత్కరిస్తున్న బొల్లం శేషి, యూత్ సభ్యులు

మానకొండూర్ రూరల్, నవంబర్ 17: మండలంలోని పచ్చునూర్ గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావును పచ్చునూర్ గ్రామ యూత్ సభ్యుడు బొల్లం శేషి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తలపాగ పెట్టి, క్రేన్ సాయంతో పెద్ద గజమాల వేశారు. శాలువాలతో సన్మానించారు. దాదాపు 30 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీ విజయానికి కృషి చేస్తున్నట్లు యూత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ సతీశ్, అరవింద్, బిట్టు, మణి, శ్యామ్, రిషిక్, సందీప్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



మానకొండూర్: మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ ముద్దసాని శ్రీధర్‌రెడ్డి

# చిల్లర రాజకీయాలు మానుకోవాలి

- వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదు
- ఎంపీపీ భర్త శ్రీనివాస్‌రెడ్డికి మాజీ సర్పంచ్ ముద్దసాని శ్రీధర్‌రెడ్డి హితవు

మానకొండూర్, నవంబర్ 17: కాంగ్రెస్ నాయకురాలు, మానకొండూర్ ఎంపీపీ ముద్దసాని సులోచన భర్త శ్రీనివాస్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని వేగురుపల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముద్దసాని శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత దూషణలకు దిగడమే కాకుండా బీఆర్ఎస్ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, ప్రవర్తన మార్చుకోవాలని హితవు పలికారు. ఇటీవల వేగురుపల్లి గ్రామంలో తమ నాయనమ్మ దశదినకర్మ జరిగితే కుటుంబ సభ్యుల కోసం, గ్రామస్తులు సేవించడానికి 16 మద్యం బాటిల్స్‌ను తీసుకువచ్చి ఇంట్లో ఉంచగా ఎన్నికల సందర్భంగా మందు పంపిణీ చేస్తున్నట్లు అధికారులకు తప్పుడు సమాచారం అందించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమది మూడు తరాలుగా రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబమన్నారు. గ్రామస్తులు తమ కుటుంబంపై చూపిస్తున్న ఆదరణ అభిమానాలను ఓర్వలేక తప్పుడు ఫిర్యాదు చేసినా తాను భయపడడం లేదన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డిని రాబోయే రోజుల్లో గ్రామస్తులు, మండల ప్రజలు తరిమి కొడతారని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల మధు, ఉండింటి శ్యాంసన్, పడాల సతీశ్‌గౌడ్, బొజ్జ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



శంకరపట్నం: మండల కేంద్రంలో సమావేశంలో మాట్లాడుతున్న క్యాదాసి భాస్కర్

# జడ్పీటీసీపై ఆరోపణలు సత్యదూరం

- ప్రెస్ మీట్‌లో బీఆర్ఎస్ నాయకులు

శంకరపట్నం, నవంబర్ 17: జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తనపై బెదిరింపులకు పాల్పడినట్లు కరీంపేట్‌కు చెందిన ఓ వ్యక్తి ఆరోపణలు సత్యదూరమైనవని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు క్యాదాసి భాస్కర్, బొజ్జ సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాచాపూర్, చింతగుట్ట గ్రామాల సర్పంచులు కొండ్ర రాజయ్య, ఆడెపు రజిత, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు క్యాదాసి భాస్కర్, బొజ్జ సుధాకర్, కనకం శంకర్, బొజ్జ రవి, మాతంగి లక్ష్మయ్య, బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు పాతకాల తిరుమల విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ కరీంపేట్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా, అదే గ్రామానికి చెందిన గోపి రాజమల్లు అనే వ్యక్తి జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తనను బెదిరించారని ఆరోపించడాన్ని ఖండించారు. రాజమల్లు గతంలో తనను ఎస్సారెస్పీ స్థలంలో ఇల్లు కట్టుకోనివ్వలేదనే అక్కసుతో జడ్పీటీసీపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యే వాహనానికి ఎదురుగా వచ్చి రైతుబంధు డబ్బులు పడడంలేదనే ఆరోపణలు చేస్తుండగా, పక్కకు తప్పుకోవాలని కోరిన జడ్పీటీసీపై అంభాడాలు వేయడం తగదన్నారు. ఆ సమయంలో తామంతా అక్కడే ఉన్నామని, రాజమల్లును ఎవరూ బెదిరించలేదని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతో నిరాధారమైన ఆరోపణలు చేస్తే తగిన మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. అసలు రైతుబంధు పథకం కాంగ్రెస్ నాయకుల కుట్రల వల్లే ఆగిందని చెప్పారు. ఆ పథకాన్ని తిరిగి బీఆర్ఎస్ అధికారం చేపట్టిన వెంటనే కొనసాగించనున్నట్లు తెలిపారు.

## మొలంగూర్‌లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

శంకరపట్నం, నవంబర్ 17: మండలంలోని మొలంగూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు మండలాల ప్రాథమికోన్నత స్థాయి పాఠశాలల సమావేశం శుక్రవారం జరిగింది. శంకరపట్నం, మానకొండూర్ మండలాల యూపీఎస్ ఉపాధ్యాయులతో హెచ్ఎం నీరజ ఆధ్వర్యంలో గణితం సబ్జెక్టుపై ఈ సమావేశం నిర్వహించారు. బేస్‌లైన్ టెస్ట్‌లు, విద్యార్థులు సాధించిన ప్రగతిపై చర్చించారు. అలాగే యూనిట్ ప్రణాళిక, పాఠ్య ప్రణాళిక ఆవశ్యకత, ఆంగ్లంలో బోధించడం, లక్ష్య ఉన్నతి కార్యక్రమం గురించి రెండు మండలాల ఉపాధ్యాయులకు రీసోర్స్‌పర్సన్లు శ్రీనివాస్, హరికృష్ణ వివరించారు. కార్యక్రమంలో శంకరపట్నం, మానకొండూర్ మండలాల ఉపాధ్యాయులతో పాటు సీఆర్‌పీ మహేశ్ పాల్గొన్నారు.